క్లుప్తంగా

అమ్మ పేరుతో మొక్క నాటండి

పెనమలూరు: ప్రతిఒక్కరూ అమ్మ పేరుతో మొక్క నాటాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. కాలేజీలోని బాలుర వసతి గృహంలో నెహ్రూ యువకేంద్రం సహకారంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు విద్యార్థులు మొక్కలు నాటి అమ్మను సంరక్షించుకున్నట్లే మొక్కలను కూడా కాపాడాలన్నారు. మొక్కలను బాగా చూసుకుంటే అవి పెరిగి మనుషులను జాగ్రత్తగా చూసుకుంటాయని తెలుపుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే ప్రగతి సాధన

పెనమలూరు: డ్వాక్రా మహిళలు చదువుకోవాలని, దీని ద్వారా ప్రగతి సాధించగలుగుతారని ఎంపీడీఓ బండి ప్రణవి అన్నారు. పెనమలూరు వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు అక్షరాస్యత పై బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో 350 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. వారికి ప్రాథమిక, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య పై శిక్షణ ఇచ్చేందుకు 35 మంది వలంటీర్లను నియమించామన్నారు. ఈ అవకాశాన్ని డ్వాక్రా మహిళలు ఉపయోగించుకోవాలన్నారు. ఏపీఎం జి. కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ నెల నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు: యనమలకుదురు ఇందిరానగర్-2లో బందరు కాలువ కట్టపై సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికుల అవసరాల మేరకు రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ పి.భవానిప్రసాద్, టీడీపీ నాయకులు ఆజాద్, ముక్తియార్, భరద్వాజ్, ధనేకుల విజయలక్ష్మి, రజిని పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను గ్రామంలో గురువారం ఉదయం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి పి.మాధురీకిరణ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం ఎప్పుడో?

కేసరపల్లి(గన్నవరం): గన్నవరం మండలంలోని కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం రైతులతో పాటు గృహ నిర్మాణ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఇక్కడ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ జలవనరుల శాఖ అనుమతులు మంజూరులో జాప్యం చోటు చేసుకుంది. తీరా పనులు ప్రారంభించే సమయానికి వంతెన ఎత్తుపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో నిర్మాణ పనులు అటకెక్కాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణం ఊసే ఎత్తకపోవడంతో రైతులతో పాటు గృహ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వంతెన నిర్మాణానికి బదులుగా ప్రత్యామ్నాయ రహదారి మార్గాలను ప్రతిపాదించడంపై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఇక్కడ వంతెన నిర్మాణం జరిగితే గృహ నిర్మాణాలు వేగవంతం కావడంతో పాటు రైతులు, కూలీలు పొలాలకు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది.

లే అవుట్లగా అభివృద్ధి

గ్రామంలోని ఏలూరు కాలువ పక్కనే ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు మరో 78 ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములను ఐదు లే అవుట్లగా అభివృద్ధి చేశారు. ఇక్కడ గన్నవరం, కేసరపల్లితో పాటు మరో ఐదు గ్రామాలకు చెందిన 3,198 మంది లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున నివేశన స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేసుకునేందుకు వీలుగా విద్యుత్, రహదారులు, తాగునీరు తదితర సదుపాయలను కల్పించారు. ఈ లేఅవుట్లకు ప్రధాన మార్గంగా కేసరపల్లి శివారు అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయించింది. టెండర్ ప్రక్రియను పూర్తిచేసి పనులు ప్రారంభించే సమయానికి ఏలూరు కాలువలో భవిష్యత్ జల రవాణా అవసరాలు దృష్ట్యా వంతెన నిర్మాణం ఎత్తుపై ఇరిగేషన్ శాఖ అభ్యంతరాలను తెలిపింది. దీంతో వంతెన నిర్మాణ ప్రక్రియ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో గృహ నిర్మాణ లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కాలనీవాసులు రహదారి మార్గంగా ఉపయోగిస్తున్న ఏలూరు కాలువ గట్టు కూడా ఇటీవల వరదలకు కోతకు గురై రాకపోకలకు అనుకూలంగా లేదు. దీంతో గృహ సామగ్రి తరలింపు కష్టతరంగా మారిందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటి వరకు కాలనీలో సుమారు 100 మంది లబ్ధిదారులు మాత్రమే గృహ నిర్మాణాలు పూర్తిచేశారు. ఇక్కడ వంతెన నిర్మాణం చేస్తే గృహ నిర్మాణాలు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది. ఇటీవల గృహ నిర్మాణ కాలనీని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి బదులుగా విద్యుత్ టవర్ల కింద నుంచి రోడ్డు మార్గంపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ప్రకటనతో ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు.



ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదించిన ప్రాంతం

రైతుల దశబ్దాల కల

అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మించాలనేది పరిసరా గ్రామాల రైతుల దశబ్దాల కల. గతంలో ఇక్కడ ఉండే బల్లకట్టు ద్వారా రైతులు, వ్యవసాయ కూలీలు పంట పొలాలకు రాకపోకలు సాగించారు. పదేళ్ల క్రితం బల్లకట్టు తుప్పు పట్టి మూలన పడడంతో పొలాలకు వెళ్లేందుకు సుమారు మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక్కడ వంతెన నిర్మాణం చేయాలని రైతులు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వంతెన నిర్మిస్తే రైతులు పండించిన పంటలను కూడా సులభంగా ఇళ్లకు తరలించుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు.

'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈఓ రామారావు

ఉయ్యూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని డీఈఓ పీవీజే రామారావు అన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో బుధవారం ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని జెడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళికతో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పది ఉత్తీర్ణతలో రాష్ట్రంలో కృష్ణా జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. గత విద్యాసంవత్సరంలో 90.5 శాతంగా ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నూరుశాతం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. అపార్ ఐడీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నూతన సిలబస్‌పై అవగాహన పెంపొందించుకుని విద్యాబోధనలో మార్పులు అందిపుచ్చుకుంటూ విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించాలన్నారు. క్రీడలు, ప్రతిభా అంశాల్లో రాణించేలా శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జీవీ రమణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీవైఈఓ పద్మారాణి, డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జీవీ రమణను సత్కరిస్తున్న డీఈఓ రామారావు

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

పెనమలూరు: విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. కాలేజీలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. గ్రంథాలయాల వలన విద్యార్థులకు విజ్ఞానం పెంపెందుతుందన్నారు. కాలేజీ గ్రంథాలయంలో అనేక విలువైన పుస్తకాలు ఉన్నాయని, వాటిని చదవటం వలన విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రో వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, గ్రంథాలయ అధికారి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నిలిచి ఉన్న బస్సును ఢీకొట్టిన మరో బస్సు

డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు గాయాలు

కేతేపల్లి: ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో హైవేపై నిలిచిపోయిన ఏపీకి చెందిన ఆర్టీసీ బస్సును మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన సంఘటనలో డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా కేతేపల్లి వద్ద విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ లగ్జరీ బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తోంది. కేతేపల్లి వద్దకు చేరుకోగానే ఇంజిన్‌లో సాంకేతిక లోపంతో రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బస్సులోని ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కించి గమ్యస్థానాలకు పంపించారు. అదే మార్గంలో వస్తున్న ఉయ్యూరు డిపోకు చెందిన మరో ఆర్టీసీ లగ్జరీ బస్సు కేతేపల్లి వద్ద రోడ్డుపై నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు కాళ్లు విరిగిపోయాయి. బస్సులో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన పి.సూర్యసాయి, తిరుపతమ్మ, రజనీలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని కేతేపల్లి ఎస్ఐ శివతేజ తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో గురువారం నుంచి ఈ నెల 19 వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పీడీ లక్ష్మి బుధవారం తెలిపారు. ఈ నెల 14న వారోత్సవాల ప్రారంభ వేడుక 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాల ఉద్యమకారులను స్మరించుట, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పోటీ పరీక్షలు, 19న ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: జిల్లా శాఖా గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మానికొండ గ్రంథాలయ అధికారి ఎల్.హరికృష్ణ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా రోజూ వివిధ పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గన్నవరం రూరల్: గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, బుధవారం పాఠకులకు విజ్ఞప్తి చేశారు. వారోత్సవాలు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. పురుషోత్తపట్నం, ముస్తాబాద గ్రంథాలయాల అధికారులు కృపానందం, జ్యోతి పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: తెన్నేరు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.సునీత తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనమలూరు: పోరంకిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బీజేఆర్ నగర్‌లో చోరగుడి ఉమాచంద్రబాబు(55) కుటుంబ సభ్యుల తో ఉంటున్నాడు. అతను వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండటంతో గత కొద్ది కాలంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి నుంచి ఇటీవలే ఇంటికి వచ్చిన ఉమాచంద్రబాబు మంగళవారం పనికి వెళ్లి వచ్చాడు. తన ఆరోగ్య పరిస్థితి బాగా లేదని, కుటుంబ సభ్యులపై ఆధారపడుతున్నానని భార్య సత్యవతి వద్ద వాపోయాడు. ఇంటి పక్కన నిరుపయోగంగా ఉన్న ఇంటికి గతంలో పెయింట్ వేయగా టిన్నర్ మిగిలి ఉండటంతో అది తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడ్ని విజయవాడ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, గన్నవరం, కేసరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. సంఘం బలోపేతానికి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులందరూ సభ్యులుగా చేరాలని కోరారు. ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలు విషయంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 12వ పీఆర్సీ ప్రకటించేలోపుగా మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బొక్కినాల శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బషీర్, పల్లె రవికుమార్, దోవర్ సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో బుధవారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తికమాసం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దీపోత్సవం జరిపారు. తొలుత శ్రీసీతారామచంద్రస్వామి వారికి పది వేల తులసి దళాలతో పూజలు నిర్వహించారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న సుందరకాండ పారాయణాన్ని భక్తులు కొనసాగించారు. సాయంత్రం ఆలయ అర్చకులు ఎన్.రామాచార్యులు నేతృత్వంలో కోటి దీపోత్సవం ప్రారంభమైంది. దావాజిగూడెం, పరిసరా గ్రామాల నుంచి తరలివచ్చిన 345 మంది భక్తులతో 3.45 కోట్ల ఒత్తులను వెలిగించారు. కార్తిక దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా దర్శనమిచ్చింది. ఆలయ కమిటీతో పాటు పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేటి ధర్నాను విజయవంతం చేయండి

పెనమలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. తాడిగడపలో బుధవారం ఐద్వా, మహిళా సంఘాలు, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాకు కారణాలు తెలుపుతూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదు నెలల్లో అనేక ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేశారన్నారు. విద్యుత్ చార్జిలుపెంపు, మద్యం షాపులు ఏర్పాటు, మహిళలకు రక్షణ లేక పోవటం ఇలా అనేక సమస్యలు ఉన్నాయన్నారు. నేడు తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాకు అన్ని వర్గాల మద్దతు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేస్తాన్‌వలి, పి.లక్ష్మీనారాయణ, ఐద్వా మండల కార్యదర్శి పుసునూరు పాతాళలక్ష్మి, టి.దుర్గారావు పాల్గొన్నారు.

చెత్త తరలింపు పనుల పరిశీలన

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త తరలింపు పనులను బుధవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జె. అరుణ పరిశీలించారు. ఇటీవల గన్నవరం, కేసరపల్లి, బుద్దవరం గ్రామ పంచాయతీల సంయుక్త నిధులు రూ.54 లక్షలతో చెత్త తరలింపు వాహనాన్ని కొనుగోలు చేశారు. ఈ వాహనం ద్వారా మూడు గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. చెత్త డంపింగ్ నిమిత్తం మూడు గ్రామాల్లో ప్రత్యేకంగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వాహనంలోకి చెత్త లోడింగ్ ప్రక్రియను డీపీఓ స్వయంగా పర్యవేక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చెత్త తరలింపు వాహనాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని డీపీఓ సూచించారు. రోజూ క్రమం తప్పకుండా సేకరించిన చెత్తను జిందాల్ ప్లాంట్‌కు తరలించాలని సూచించారు. ఈఓపీఆర్డీ టి.భారతి, గన్నవరం, కేసరపల్లి ఈఓలు చెన్నకేశవరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సేవాసదనం ప్రారంభం

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన సేవా సదనం భవనాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ఆలయ కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం సుమారు రూ.కోటి వ్యయంతో సేవా సదనం నిర్మించినట్లు చెప్పారు. సేవా సదనం నిర్మాణానికి గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమవంతు సహకారం అందించినట్లు తెలిపారు. శ్రీలక్ష్మీతిరుపతమ్మ వార్షిక కల్యాణంలోపు సేవాసదనం భవన నిర్మాణ పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. తొలుత శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాన్ని జరిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు, ఎమ్మెల్యే వెంకట్రావు సోదరుడు సతీష్‌బాబు, తహసీల్దారు వెంకటశివయ్య, ఎంపీడీఓ టి.స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

రూ. 2.50 లక్షల సొత్తు చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో తాళం వేసిన ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న షేక్ షబ్బీర్ ఇంట్లో జరిగిన ఘటనలో రూ.2.50 లక్షల విలువ జేసే బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. లారీ డ్రైవర్‌గా పనిచేసే షబ్బీర్ రెండ్రోజుల క్రితం డ్యూటీకి వెళుతూ గర్భిణిగా ఉన్న భార్యను పుట్టింటికి పంపాడు. ఈ నేపథ్యంలో ఇంటి తాళం వేసి భార్యాభర్తలు ఇరువురు వెళ్లిపోవటంతో దొంగలు అదును చూసుకుని చోరీకి పాల్పడ్డారు. షబ్బీర్ డ్యూటీ నుంచి బుధవారం ఇంటికి తిరిగి రావటంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో లోనికి వెళ్లి చూడగా, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో ఉన్న బీరువాలో భద్రపర్చిన మూడు కాసుల బంగారు నెక్లెస్, రెండు కాసుల నల్లపూసల గొలుసు, 20 కాసుల వెండి ఆభరణాలుతో పాటుగా రూ.5 వేలు నగదు అపహరణకు గురైనట్లుగా గుర్తించారు. ఈ మేరకు వీరవల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

గన్నవరం: ఓ బాలికను మాయ మాటలతో లొంగదీసుకుని లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై గన్నవరం పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని ముస్తాబాదకు చెందిన పులివర్తి ప్రశాంత్ అలియాస్ బన్ను అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. ఆ బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో కడుపునొప్పితో బాధపడుతున్న ఆ బాలికను తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు సదరు బాలిక గర్భిణి అని నిర్ధారించారు. ఆ బాలికను తల్లిదండ్రులు నిలదీయగా అందుకు శ్రీకాంత్ కారణమంటూ వెల్లడించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీకాంత్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరి కోతలు ఆలస్యంగా చేపట్టండి

పెనమలూరు: వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున రైతులు వరి కోతలు ఆలస్యంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి అన్నారు. మండల పరిధిలోని గంగూరు, పోరంకి, యనమలకుదురు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అల్పపీడనం కారణంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు కొన్ని రోజులు వాయిదా వేయాలన్నారు. రైతులు వారం రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు మాట్లాడుతూ రబీ లో వరి సాగుకు అనుమతి ఇవ్వాలని కోరారు. రబీలో వరిపంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఏఓ శైలజ, వీఏఏలు జమీల అంజుమ్, వెంకటేశ్వరరావు, అహల్య పాల్గొన్నారు.

సర్వే నూరు శాతం చేయాలి

విజయవాడరూరల్: హౌస్‌హోల్డ్ సర్వే నూరు శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ఈ నెల 24 లోగా పూర్తి చేయాలన్నారు. వేరే ప్రాంతాల నుంచి వచ్చి రూరల్ మండల గ్రామాల్లో నివాసం ఉంటున్న వారి, ఒకే ఇంటిలో అద్దెకు ఉండేవారు, ఇంటి యజమాని వివరాలను నమోదు చేసే ప్రక్రియపై గైడ్‌లైన్సు వస్తాయని తెలిపారు.